## క్లుప్తంగా

### అదనపు ఎస్పీకి అభినందన



అదనపు ఎస్పీ భాస్కరరావును అభినందిస్తున్న దూసర్లపూడి రమణరాజు

కాకినాడ క్రైం: ప్రతిష్ఠాత్మక ఉగాది సేవా పురస్కారాన్ని దక్కించుకున్న కాకినాడ జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావును పౌర సంఘం కన్వీనర్, సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో కలిసి అభినందించారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సత్కరించారు.

### బాలాత్రిపుర సుందరి ఆలయంలో హుండీల లెక్కింపు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని బాలా త్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయ హుండీలను గురువారం లెక్కించారు. మూడు నెలల వ్యవధికి రూ.1.26 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: జేఎన్‌టీయూ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో డీఈ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో వెంకట్‌నగర్, జయేంద్రనగర్, డీ మార్ట్ ఏరియా, గొడారిగుంట, సురేష్‌నగర్, కొండేలుపేట, మాధవనగర్, శ్రీనగర్, శ్రీవిద్యకాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు. ప్రజలు ఈ అసౌకర్యానికి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

### కూటమి ప్రచారం

కరప: మండలం వేములవాడ శివారు సిరిగలపల్లంకలో గురువారం కాకినాడ రూరల్ నియోజకవర్గ కూటమి అభ్యర్థి పంతం నానాజీ జేఎస్‌పీ, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కల్సి ఎన్నికల ప్రచారం చేశారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### గ్రామాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యటన



నిత్యావసర సరకుల పంపిణీ వాహనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ టీమ్ మండల పరిధిలో వివిధ గ్రామాల్లో పర్యటించారు. రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, బోర్డులు, వాల్ పోస్టర్ల తొలగింపు గడువు ముగియడంతో గురువారం సాయంత్రం వీకే రాయపురం, మాధవపట్నం గ్రామాలను పర్యటించి ప్రజల నుంచి సమాచారం సేకరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ లీడర్ ఎంపీడీఓ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ ప్రజలు వారి వారి ఇళ్లపై జెండాలు, బ్యానర్లు ఏర్పాటు చేసుకోవడానికి ఆర్డీఓ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడానికి వీలు లేదని హెచ్చరించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో పరిశీలించిన వివరాలను వీడియోలో చిత్రీకరించారు. వీకే రాయపురం గ్రామంలో లబ్ధిదారుల ఇంటి వద్దకే నిత్యావసర సరకులు తీసుకువెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, వీకే రాయపురం, మాధవపట్నం పంచాయతీల కార్యదర్శి వై.శ్రీహరి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### మరిడమ్మ తల్లి హుండీల ఆదాయం రూ.1.66 లక్షలు



హుండీలను తెరిపిస్తున్న ఆలయ అధికారులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయానికి హుండీల ద్వారా 41 రోజులకు సుమారు రూ.1,66,797 ఆదాయం సమకూరినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు తెలిపారు. గురువారం ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, పెద్దాపురం డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయ్‌బాబు నాయుడు, కాండ్రకోట నూకాలమ్మ ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణల సమక్షంలో హుండీలను లెక్కించారు. ఆలయ వేద పండితులు, ఆసాదులు, దేవస్థానం సిబ్బంది, మహిళా భక్త మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సుందర రహదారులు

- కోడ్‌తో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీల తొలగింపు
- విశాలంగా దర్శనమిస్తున్న రహదారులు



సర్పవరం జంక్షన్‌లో విగ్రహానికి వేసిన ముసుగు



కాకినాడ - పిఠాపురం రోడ్డులో సర్పవరం జంక్షన్ వద్ద డివైడర్ మధ్య స్తంభాలకు ఫ్లెక్సీలు తొలగింపుతో విశాలంగా కనిపిస్తున్న రహదారి

కాకినాడ రూరల్: రాజకీయ నాయకులు, పార్టీల ప్రకటనలతో నిత్యం దర్శనమిచ్చే రహదారులు ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల పుణ్యమా అని విశాలంగా దర్శనమిస్తున్నాయి. ఎన్నికల ప్రవర్తనా నియావళి ప్రకారం రాజకీయ పార్టీల ప్రకటనలు గల ఫ్లెక్సీలు, హోర్డింగులు తొలగించాలని ఎన్నికల సంఘం ఆదేశాలతో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టును ఎన్నికల సిబ్బంది పక్కాగా అమలు చేస్తున్నారు. నియోజకవర్గంల్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిశోర్ పర్యవేక్షణలో ఫ్లయింగ్ స్క్వాడ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ టీమ్, వీడియో సర్వేలెన్స్ టీమ్, వీడియో ఆధారంగా అభ్యర్థులకు ఖర్చు జమ చేసేలా వీవీటీ టీమ్, అకౌంట్ టీమ్ పనిచేస్తున్నాయి. ఇప్పటికే రహదారులు, కూడళ్లలో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు తొలగించిన సిబ్బంది నేతల విగ్రహాలను క్లాత్‌తో మూసివేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, శిలాఫలకాలపై ప్రజా ప్రతినిధులు చిత్రాలు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ ఎన్నికల అధికారి కిశోర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేస్తున్నామని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిబంధనలకు లోబడి అనుమతులు తీసుకోవాలన్నారు.

# ప్రచారానికి వైఎస్సార్ సీపీ శ్రీకారం



ఏటిమొగలో ప్రజలను ఓటు అభ్యర్థిస్తున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- ఏటిమొగలో మత్స్యకారుల బ్రహ్మరథం
- ద్వారంపూడికి అపూర్వ స్వాగతం



మత్స్యకార మహిళను ఆప్యాయంగా పలకరించి ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ఎన్నికల ప్రచారానికి వైఎస్సార్ సీపీ గురువారం శ్రీకారం చుట్టింది. మత్స్యకారులు అధికంగా నివసించే ఏటిమొగ ప్రాంతం నుంచి సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రచారాన్ని ప్రారంభించారు. పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలతో కలిసి తొలుత ఏటిమొగ ముల్లారమ్మతల్లి ఆలయం వద్ద అమ్మవారిని దర్శించి అక్కడి నుంచి ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. దారిపొడవునా పూలు చల్లుతూ హారతులిచ్చి ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ప్రతి ఇంటి వద్దా గడచిన ఐదేళ్లలో మత్స్యకారుల సంక్షేమానికి, ఏటిమొగ ప్రాంత అభివృద్ధికి చేసిన కృషిని ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి వివరిస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న తనను మంచి మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మున్నెన్నడూలేని విధంగా అర్హత కలిగిన ప్రతి ఒక్క మత్స్యకార కుటుంబానికి ఇంటి స్థలం ఇచ్చామని, ఎన్నికల్లో విజయం సాధించాక 18 నెలల వ్యవధిలో ఇళ్లను కూడా నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు.

**ఏటిమొగను ఎంతో అభివృద్ధి చేశా**

ఏటిమొగలోని మత్స్యకార ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయగలిగానని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టిన సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ హాళ్లు, పార్కులు వంటి సకల మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. అయితే ఓఎన్‌జీసీ, రిలయన్స్, జీఎస్‌పీసీ వంటి సంస్థల కార్యకలాపాల వల్ల మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయి ఎంతో నష్టపోతున్నారని, వీరికి న్యాయం చేసేందుకు తాను అన్నివిధాలా చర్యలు తీసుకుంటున్నానన్నారు. ఇటీవలే మత్స్యకారుల కోసం చేసిన ఉద్యమం ఫలించి కమిటీ వేశారని, ఆ నివేదిక వచ్చిన వెంటనే ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేందుకు తనవంతు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఉప్పాడ నుంచి ఉప్పలంక వరకు సీఎస్సార్ నిధులతో అభివృద్ధి చేసేందుకు మరింత ఒత్తిడి చేస్తానన్నారు. ఎమ్మెల్యే వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు, మత్స్యకార ప్రతినిధులు కాటాడి జానికిరామ్, భీమరాజు, చక్రవర్తి, సంగాని నందం, చవ్వాకుల రాంబాబుతోపాటు పెద్ద ఎత్తున మత్స్యకారులు పాల్గొన్నారు.

# పోలింగ్ స్టేషన్లలో వసతులు కల్పించాలి

- ఈఆర్వో కిశోర్
- కోడ్ అమలు పరిశీలన
- వసతుల కల్పనపై అవగాహన



కరపలో ఎన్నికల కోడ్, పీఎస్‌లలో వసతులపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న ఆర్వో కిశోర్

కరప: సార్వత్రిక ఎన్నికలు జరిగే పోలింగ్ స్టేషన్లలో కనీసవసతులు కల్పనకు అన్నిచర్యలు తీసుకోవాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఈట్ల కిశోర్ అన్నారు. మండలంలోని పోలింగ్ స్టేషన్లను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, గ్రామకార్యదర్శులు, వీఆర్వోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల కోడ్ అమలు, పోలింగ్‌స్టేషన్లలో కల్పించాల్సిన వసతుల గురించి ఆయన అవగాహన కల్పించారు.

ప్రతి పోలింగ్ స్టేషన్‌లో విద్యుత్, టాయ్‌లెట్లు, తాగునీరు వంటి వసతులు ఉన్నాయో లేదో పరిశీలించి, వాటిని సమకూర్చాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో పార్టీ కార్యాలయాలకు అనుమతులు ఇవ్వాలంటే పోలింగ్‌స్టేషన్లకు, దేవాలయాలకు, చర్చిలకు, మసీదులకు, పాఠశాలలకు 200 మీటర్ల దూరంలో ఉండాలన్నారు. కార్యాలయం నిర్వహణకు, ఎన్నికల ప్రచారానికి, సమావేశాల నిర్వహణకు, మైక్‌సెట్ వినియోగానికి, వాహనాల వినియోగానికి ఆర్వో నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. వాటర్ ట్యాంకులు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయ భవనాలు, ఆరోగ్య కేంద్రాల ప్రారంభోత్సవాల సందర్భంగా ఏదేని పార్టీ జెండాల రంగులను పోలిన రంగులు ఉన్నట్లయితే వాటిని తొలగించాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కమిడి భీమశంకర్ తమ గ్రామంలో వాటర్ ట్యాంక్‌కు రెండు రంగులే ఉన్నాయని, వాటిని తొలగించమంటున్నారని ఆర్వో దృష్టికి తీసుకెళ్లగా వైఎస్సార్‌సీపీ జెండా మూడు రంగులుంటే తొలగించాలని, రెండు రంగులుంటే అవసరం లేదని ఆర్వో తెలిపారు. కరపలో జనసేన పార్టీ కార్యాలయానికి అనుమతిచ్చారా అని పాత్రికేయులు ఆర్వో దృష్టికి తీసుకెళ్లగా సదరుపార్టీ కార్యాలయం నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్‌స్టేషన్‌కు 200 మీటర్ల లోపుల్లో ఉన్నందును దానిని తొలగించి, వేరేచోటకు మార్చాలని తెలియజేశామని ఆర్వో కిశోర్ వివరించారు. ఎంపీడీఓ కె.అప్పారావు, తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు, ఎంఈఓ పి.సత్యనారాయణ, ఈఓ పీఆర్డీ బీఏ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ సదస్సులో విద్యుత్ సమస్యల పరిష్కారం



సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న న్యాయస్థానం సభ్యులు

పిఠాపురం: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి గురువారం పిఠాపురం విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద విద్యుత్ సమస్యల పరిష్కార న్యాయస్థానం నిర్వహించారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ, సభ్యులు ఎం.శ్రీనివాస్, రాయసం సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొని విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఠాపురంలో విద్యుత్ సమస్యలపై ఏడు ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిపై విచారణ జరిపి 60 రోజుల్లో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త చట్టం ప్రకారం విద్యుత్ ప్రమాదాల వల్ల ఎవరికైనా నష్టం కలిగితే విద్యుత్ అధికారుల ద్వారా నష్ట పరిహారం అందించనున్నట్లు తెలిపారు. 2016 నుంచి ఇప్పటివరకూ 7868 ఫిర్యాదులు రాగా వాటిలో 7777 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. ఇంకా 111 సమస్యలు పరిష్కరించాల్సి ఉందన్నారు. విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి సమస్యలు ఉన్నా ఇక్కడ ఫిర్యాదు చేస్తే వాటికి పరిష్కారం చూపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ ఆర్ శ్రీనివాస్, పలువురు వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

తాళ్లరేవు: వనామీ రొయ్యల పెంపకంలో మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని శాస్త్రవేత్త డా.కార్తిరెడ్డి శ్యామల తెలిపారు. చొల్లంగిపేట పంచాయతీలో కేంద్రీయ మత్స్య శిక్షణ సంస్థ(సీఐఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. గురువారం శిక్షణ ముగింపు కార్యక్రమంలో శ్యామల మాట్లాడుతూ రొయ్యల పెంపకంలో మెళకువలు వివరించడంతో పాటు ఆక్వా రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కాకినాడ కేంద్రం ఇన్‌చార్జ్, సీనియర్ శాస్త్రవేత్త డా.మురళీధర్, పి.అందె, సీఐఎఫ్‌ఐ డైరెక్టర్ వైస్ ఛాన్సలర్ డా.సీఎన్ రవిశంకర్, ప్రిన్సిపాల్ డా.జహంగీర్, శ్రీనివాసరావు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## మానవ మనుగడకు అడవులు దోహదం



విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్న అటవీ శాఖ అధికారులు

తాళ్లరేవు: మానవుల మనుగడకు అడవులు ఎంతగానో దోహదపడతాయని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ అన్నారు. గురువారం ప్రపంచ అటవీశాఖ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోరంగి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫారెస్ట్ రేంజర్ వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను కాపాడేందుకు అడవుల పాత్ర ఎంతో కీలకమన్నారు. అనేక పక్షి, జంతు, మత్స్య జాతులకు కోరంగి అభయారణ్యం ఆవాసంగా ఉందన్నారు. తీర ప్రాంతానికి రక్షణ కవచంగా ఉన్న కోరంగి అభయారణ్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులచే మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌లు ఎం.నాగార్జున, ఎస్.వీరభద్రరావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌లు జి.గోపి నాగేంద్ర కుమార్, కె.మహేష్, కె.ధనుంజయరావు, ఎస్‌కేఎం సుభాని, పి.సంధ్యారాణి, పాఠశాల సిబ్బంది సుబ్రహ్మణ్యం, మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సోమేశ్వరస్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న దవులూరి తదితరులు

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెం గ్రామంలోని రాజేశ్వరీ సమేత సోమేశ్వర స్వామి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు పాల్గొన్ని కల్యాణం తిలకించి, స్వామి వారికి పూజలు చేశారు. ఎంపీపీ సత్తిబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## దాత ఆశయాలకు అనుగుణంగా సేవలు



చినశోభనాద్రి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

బోట్‌క్లబ్: దాత ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని దేవదాయశాఖ డీసీ కార్యాలయ సూపరింటెంటెంట్ కె.నాగేశ్వరరావు అన్నారు. స్థానిక పెద్దమార్కెట్‌లోని బంగారు చినశోభనాద్రి సత్రం వ్యవస్థాప దినోత్సవం సందర్భంగా గురువారం అన్నదానం చేశారు. తొలుత దాత బంగారు చినశోభనాద్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదల కోసం ఆలయాలు, వివిధ సత్రాలు నిర్మించిన శోభనాద్రి ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలచి ఉంటారన్నారు. 1924లో ఈ సంస్థ స్థాపించి నిరుపేదల కోసం తన ఆస్తిని సత్రానికి రాసి ఇచ్చిన బంగారు చినశోభనాద్రి మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ తోట సుబ్రహ్మణ్యం, దేవదాయ శాఖ డీఈ తోట దుర్గేష్, సత్రం ఈఓ అడబాల శ్రీనివాస్, దేవదాయశాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్ పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీలో 200 మంది చేరిక



పిల్లి రామారావును వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

- ఆహ్వానించిన ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: విశ్రాంత అసిస్టెంట్ ఇంజినీర్, దళిత నాయకులు పిల్లి రామారావుతో సహా ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన సుమారు 200 మంది గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక డి కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం, జనసేనతో పాటు వివిధ రాజకీయ పార్టీల్లో చురుగ్గా పనిచేస్తున్న వీరంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరేందుకు ముందుకు వచ్చారు. 8వ డివిజన్ గొడారిగుంట, రేచర్లపేట, రెల్లిపేట వంటి ప్రాంతాల నుంచి దాదాపు 200 మంది తరలివచ్చి పార్టీలో చేరారు. ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా కష్టించి పనిచేయాలని సూచించారు. దళితుల సంక్షేమానికి చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, శెట్టిబలిజ సంఘ నాయకులు వీరంశెట్టి, న్యాయవాదులు డాక్టర్ పృథ్వీరాజ్, జగడం రవి (గోపి), ధనరాశి శ్యామ్, గండేటి కుమార్‌బాబు (కింగ్), తుమ్మల నూకరాజు, గోపీ, వివిధ వర్గాల ప్రతినిధులు సంగడాల వెంకటరమణ, వాసా బాబ్జి, కొండేపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కన్నబాబు సమక్షంలో మత్స్యకారులు..



వైఎస్సార్ సీపీలో చేరిన మత్స్యకార పెద్దలు

కాకినాడ రూరల్: మండలంలోని వలసపాకల గ్రామానికి చెందిన మత్స్యకారులు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం మత్స్యకార సంఘ పెద్దలు బొడ్డు దుర్గ, పంతాడి సూరిబాబు, వీరమణి, నవాబు, సత్తిబాబు, కర్రి కామేశ్వరి, బొడ్డు శ్రీను, రేవు జోషి, మల్లాడి దుర్గ, మహేశ్వరరావు తదితరులు సుమారు 80 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కన్నబాబు వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి విజయాన్ని అందివాల్సని కోరారు.

**కన్నబాబును కలిసిన శెట్టిబలిజ నేత రాయుడు**



ఎమ్మెల్యే కన్నబాబును సత్కరిస్తున్న శెట్టిబలిజ నేత నాగేశ్వరరావు

రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కన్నబాబును శెట్టిబలిజ సంక్షేమ సంఘం నాయకుడు రాయుడు నాగేశ్వరరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శెట్టిబలిజ సామాజికవర్గంలో మంచి పట్టు ఉన్న నాగేశ్వరరావు కలిసి కన్నబాబును పూలమాలతో సత్కరించారు.

# ముద్రణ సమాచారాన్ని కచ్చితంగా ఇవ్వాలి



ఫ్లెక్సీ, ప్రింటింగ్ ప్రెస్‌ల ప్రతినిధులతో సమావేశమైన రిటర్నింగ్ అధికారి వెంకటరావు

- ఫ్లెక్స్, ఆఫ్‌సెట్ ప్రింటర్లకు ఈఆర్వో వెంకటరావు ఆదేశం

కాకినాడ: ఎన్నికల ప్రచారానికి వివిధ రాజకీయ పార్టీలు ముద్రించే ఫ్లెక్సీలు, కరపత్రాలు, స్టిక్కర్లు, ఇతర ప్రచార సామగ్రికి సంబంధించి కచ్చితమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలని సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఫ్లెక్సీ, ఆఫ్‌సెట్ ప్రింటర్లు, ఇతర ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులతో ఆర్వో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసేవరకు ఏ ఒక్కరు ప్రింటింగ్‌కు ఆర్డర్ ఇచ్చినా అందుకు సంబంధించి అనుసరించాల్సిన మార్గదర్శకాలను వివరించారు. ప్రింటింగ్ కోసం వచ్చిన సంస్థ లేదా వ్యక్తి ఎవరు? ఏ తేదీన ఆర్డర్ ఇచ్చారు? ఎంత ఆర్డర్ ఇచ్చారు? వంటి సమాచారానికి సంబంధించి ప్రొఫార్మాను నింపి సంతకాలు తీసుకుని సమగ్రమైన వివరాలతో కలెక్టరేట్, ఆర్వో కార్యాలయానికి కచ్చితంగా ఎప్పటికప్పుడు అందజేయాలని స్పష్టం చేశారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆయా ప్రింటింగ్ యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫ్లెక్సీ ప్రింటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం.వెంకట్, మహేష్, శ్రీను, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సీతాపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## సేవాదళ్ కార్యదర్శిగా దుర్గాప్రసాద్

కాకినాడ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా కర్రి దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆమోదంతో పార్టీ కేంద్ర కార్యాలయం ఈ నియామకాన్ని ప్రకటించింది.

## పౌష్టికాహారం పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు ఉమా మనో వికాస కేంద్రం ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకటరావు, అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.